ప్రకృతితో ప్రయాణం

- జీవవైవిధ్య ఉద్యానవనంలో విజ్ఞాన యాత్ర
- పెద్ద సంఖ్యలో హాజరైన ప్రకృతి ప్రేమికులు



సీతాకోక చిలుకగా మారుతున్న గొంగలి పురుగు

ఏయూ క్యాంపస్: ఉషోదయం వేళ ప్రకృతితో మమేకయ్యారు. వేలాది మొక్కల నడుమ నడక సాగించారు. ఈ విజ్ఞాన యాత్రకు వేదికగా నిలిచింది రాణీచంద్ర మణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనం. ఆదివారం ఉదయం ఏపీ అటవీ శాఖ, వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సంయుక్తంగా ఉషోదయపు ప్రకృతి నడక కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ యాత్ర సుమారు మూడు గంటల పాటు సాగింది. నగరంలోని విభిన్న రంగాల్లో స్థిరపడిన అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జురాసిక్ కాలం నాటి మొక్కల విశేషాలను



నీటిలో పెరిగే మొక్కలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రకృతి ప్రియులు

పార్క్ నిర్వాహకులు డాక్టర్ మంథ రామమూర్తి, మంగతాయి దంపతులు వివరించారు. అనంతరం ఔషధ వనం, ఎడారి మొక్కలు, నీటిలో జీవించే మొక్కలు, అరుదైన రుద్రాక్ష చెట్టు, కృష్ణుడి వెన్న గిన్నె, సీతమ్మవారి జడ, ఆశోక వృక్షం వంటివి సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రతీ చెట్టు, మొక్క సమాచారాన్ని తెలియజేస్తూ వాటిలోని ఔషధ విలువలు, వివరాలు వివరించారు. కీటకాలను తినే మొక్కలు, అరుదైన ఆర్కిడ్‌లు, విభిన్న రకాల పామ్ ట్రీలను తిలకించి సంబరపడ్డారు. గొంగలి పురుగు సీతాకోక చిలుకగా మారే ప్రక్రియను ఇక్కడ ప్రత్యక్షంగా చూసిన సందర్శకులు అచ్చెరువొందారు. అరుదైన, అంతరించే ప్రమాదం ఉన్న వేలాది మొక్కలను పార్క్‌లో సంరక్షిస్తూ, విద్యార్థులకు ఒక జ్ఞాన కేంద్రం



పార్క్ విశేషాలను వివరిస్తున్న నిర్వాహకుడు రామమూర్తి

గా దీనిని నిలుపుతున్నట్లు నిర్వాహకులు రామమూర్తి తెలిపారు. యువత డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీలో సభ్యత్వం తీసుకుని పార్క్ నిర్వహణ, సంరక్షణలో భాగం కావాలని కోరారు.

విస్తృత ప్రచారం అవసరం



మొక్కలంటే నాకు చాలా ఇష్టం. ఈ పార్క్‌ను తరచూ సందర్శిస్తుంటాను. ఇక్కడ ఉన్న వైవిధ్యమైన మొక్కలు మరెక్కడా చూలలేం. దీనికి విస్తృత ప్రచారం అవసరం. కృత్రిమ, అనుకూల పరిస్థితులను కల్పించి ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి మొక్కలను పెంచుతున్న నిర్వాహకులకు అభినందనలు.

– ఆర్.నీహారిక, ఉద్యోగిని

తెలుసుకుని వచ్చాను..



విశాఖపట్నంలో ఇటువంటి పార్క్ ఉందని తెలియడంతో చూడాలని వచ్చాను. నేను ఉంట్లో కూడా అనేక రకాల మొక్కలు పెంచుతుంటాను. మొక్కల పెంపకం, సంరక్షించడం, వాటి ప్రత్యేకతలు ఇక్కడికి వచ్చాక తెలుసుకున్నాను.

– ఎం.సాయి ప్రణతి

ఆరిలోవలో పెట్రోల్ దొంగలు



ఇటీవల రామకృష్ణాపురంలో పెట్రోల్ తీయడానికి తీసుకొచ్చి బైక్ వద్ద విడిచిపెట్టిన బాటిల్

ఆరిలోవ: చిల్లరి దొంగల బెడద ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో రోజురోజుకూ పెరిగిపోతోంది. రాత్రి వేళ ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్ తీసేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇరుకు వీధులు.. వాటికి ఇరుపక్కలా చిన్నపాటి ఇళ్లు ఎక్కువగా ఉంటాయి. సెల్లార్లు అంటూ ఉండవు. దీంతో ఇళ్ల ముందు రోడ్డు పక్కనే వాహనాలు పార్క్ చేస్తుంటారు. ఇదే అదనుగా అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఖాళీ వాటర్ బాటిళ్లు తీసుకొచ్చి వాహనాల నుంచి ఎంచక్కా పెట్రోల్ చోరీ చేస్తున్నారు. తెల్లవారే సరికి పెట్రోల్ ట్యాంక్ ఖాళీ అయిన వాహనం చూసిన యజమాని లబోదిబోమంటున్నాడు. పనిమీద అర్జెంట్‌గా బయటకు వెళ్లాల్సిన వారు ఆటోలు, బస్‌లు ఎక్కి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా రోజూ ఏదో ఒకచోట చిల్లర దొంగతనాలు జరుగుతున్నాని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, పాండురంగాపురం, నెహ్రూనగర్, టీబీసీ పాయింట్, అంబేడ్కర్‌నగర్, బాలాజీనగర్, ముస్తఫాకాలనీ, గాంధీనగర్, తోటగరువు, ఇందిరానగర్‌లో నిత్యం పెట్రోల్ దొంగల హల్‌చల్‌తో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు.

- కొండవాలు ప్రాంతాల ప్రజలకు ఇది మరింత సమస్యగా మారింది. హనుమంతవాక నుంచి సంజయ్‌గాంధీకాలనీ, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురంతో పాటు ఆదర్శనగర్ ప్రాంతం సుందర్‌నగర్ కొండవాలు, తోటగరువు, బీఎస్ఆర్ నగర్, బాలాజీనగర్‌లో బీసీ కాలనీ ప్రాంతాలలో అందరూ రాత్రి వేళ ద్విచక్ర వాహనాలను కొండదిగున రోడ్డు పక్కన వరుసగా పార్క్ చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో వాహనాల నుంచి పెట్రోల్ చోరీ ఎక్కువగా జరుగుతోంది. ఇటీవల రామకృష్ణాపురంలో రోజూ దొంగలు పెట్రోల్ తీసేస్తుండటంతో ఓ రోజు స్థానిక యువకులు కాపలాకాచి ఇద్దర్ని పట్టుకొని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి చినగదిలిలో రెండు బైక్‌లు, గాంధీనగర్‌లలో ఒక బైక్, డ్రైవర్స్ కాలనీలో ఒక బైక్‌లో పెట్రోల్ తీసేశారు. ఇప్పటికైనా ఆరిలోవ పరిసరాల్లో పోలీసులు నైట్ పెట్రోలింగ్‌పై మరింత ఎక్కువ దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వివాహిత అదృశ్యం



జ్యోతి(ఫైల్)

ఎంవీపీ కాలనీ: స్థానిక మంగాపురం కాలనీకి చెందిన మసాదా జ్యోతి(26) అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. మంగాపురం కాలనీకి చెందిన సీతిని అంజిబాబు(30)కు ఈ నెల 11న జ్యోతితో అన్నవరంలో వివాహమైంది. ఓ ప్రైవేట్ సెలూన్‌లో ఉద్యోగం చేస్తున్న అంజిబాబు భార్యతో కలిసి మంగాపురం కాలనీ తారా మసీదు ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అయితే భార్య జ్యోతి వివాహం జరిగిన రోజు నుంచి స్నేహితుడు నెపంతో తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగికి చెందిన చెక్కా గోపికిషన్‌తో ఫోన్‌లో మాట్లాడుతోంది. దీంతో అంజిబాబు ఈ నెల 23వ తేదీ రాత్రి మందలించాడు. అనంతరం భార్యాభర్తలు ఇద్దరు నిద్రపోగా ఉదయం లేచి చూసేసరికి జ్యోతి కనిపించలేదు. బంధు మిత్రులు ఇంటి వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. అంజిబాబు ఆదివారం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఎంవీపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఇసుకతోటలో అన్నదానం



అన్నవద్దన చేస్తున్న కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో శ్రీకృష్ణా ఉమా మహేశ్వర సాయి దుర్గా యాదవ సేవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కనకదుర్గమాంబ జాతరలో భాగంగా ఆదివారం అన్నదానం చేశారు. మారువారం పండగలో భాగంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అన్నతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ అతిథులుగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సుమారు 2 వేల మంది భక్తులు హాజరై ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు ప్రసాదుల పోలారావు, గొలగాని రాము, అధ్యక్షుడు ఈగల శివ గోవింద్, మాజీ అధ్యక్షుడు బొట్టా శివ, ప్రధాన కార్యదర్శి బొట్టా గణేష్, కోశాధికారి పల్లా శివ, కార్యదర్శి బొట్టా లింగేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు పీల రమణ

ఎంవీపీ కాలనీ: కొత్త వెంకోజిపాలెం గ్రామ సేవా సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సంఘం కార్యాలయంలో సభ్యులు కొత్త కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా పీల రమణ, ఉపాధ్యక్షుడిగా బొడ్డేటి గోవింద్, ప్రధాన కార్యదర్శిగా కాండ్రేగుల సూరేష్, కార్యదర్శిగా శరకం అప్పలరాజు, సహాయ కార్యదర్శిగా కళ్లా రాజు, కోశాధికారిగా బొడ్డేటి రామచంద్రరావు, ఆడిటర్‌గా పిల్లా ప్రతాప్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం మాజీ అధ్యక్షుడు మద్దాల వీర వెంకట అప్పారావు కమిటీకి బాధ్యతలు అప్పగించి అభినందించారు.

సాగరతీరం పరిశుభ్రం



తీరంలో శుభ్రం చేస్తున్న యువకులు

బీచ్ రోడ్డు: సముద్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గార్డ్ ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరాన్ని పరిశుభ్రం చేశారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు తీరంలోని చెత్తను సేకరించారు. ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించి పర్యావరణం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం



సూరిశెట్టి కాశీవిశ్వనాథ్

మర్రిపాలెం: గత నెలలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గవర కంచరపాలెంలో నివసిస్తున్న సూరిశెట్టి కాశీవిశ్వనాథ్ ఆటోనగర్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇతడికి 2016లో వివాహం జరిగింది. దంపతుల మధ్యలో ఎటువంటి తగాదాలు లేవు. సదరు వ్యక్తి ఫోన్‌లో బెట్టింగులు ఆడేవాడు. గత నెల 15న పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కాశీవిశ్వనాథ్ తండ్రి సూరిశెట్టి రాము కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

జిల్లా ధార్మిక కమిటీ ఎంపిక



కొత్తగా ఎంపికైన కమిటీ సభ్యులు

ఎంవీపీ కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్(హెచ్‌డీపీ) విశాఖ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా నూతన ధార్మిక కమిటీ ఎంపిక ఎంవీపీ కాలనీలో ఆదివారం జరిగింది. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా హిందూ ధర్మ ప్రచారానికి విశేష సేవలు అందిస్తున్న పలువురిని కమిటీలో సభ్యులుగా నియమించారు. పి.సత్యకుమార్, రమాదేవి, పీవీవీ కామేశ్వరరావు, బి.రాజారావు, ఎం.శ్రీనివాస్, పట్టాభి సూర్యనారాయణమూర్తి, ఎస్.హరిలక్ష్మి, పి.జగన్మోహనరావు, రాధాకృష్ణ, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, వెంకటరమణ, అప్పలనరసింహం, ఎం.వెంకటరమణ ఈ కమిటీలో సభ్యులుగా ఎంపికయ్యారని హెచ్‌డీపీ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వరశర్మ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం

- స్పష్టం చేసిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 864వ రోజుకు ఉక్కు రిలే నిరాహార దీక్షలు



దీక్షలో పాల్గొన్న నడుపూరు గ్రామ ప్రజలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. లేకుంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 864వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో నడుపూరు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రప్రభుత్వం దుర్మార్గంగా ఆలోచిస్తోందన్నారు. నిర్వాసితులకు ఇప్పటికీ సరైన న్యాయం చేయలేదని, ప్లాంట్‌లో ఉపాధి కోసం సుమారు 15 వేల మంది నేటికీ ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, గంగరావు, గంధం శ్రీనివాస్, ఆదినారాయణ, ఎస్.రామారావు, అయెధ్య రామ్, మంత్రి శంకర్‌నారాయణ, నడుపూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి బేడామండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పఠించారు.

ఘనంగా నిత్యకల్యాణం

అప్పన్న స్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు కల్యాణం నిర్వహించారు.

సెంచూరియన్ వర్సిటీ చాన్సలర్ రాజుకు సత్కారం



ఆచార్య జీఎస్ఎన్ రాజును సన్మానిస్తున్న వివిధ కళా సంఘాల ప్రతినిధులు

మద్దిలపాలెం : సెంచూరియన్ యూనివర్సిటీ(సీయూ) చాన్సలర్‌గా ఇటీవల పదోన్నతి పొందిన ఆచార్య జి.ఎస్.ఎన్.రాజును ఆదివారం నగరానికి చెందిన వివిధ కళా సేవా సంఘాల ప్రతినిధులు జె.ఆర్.నగర్‌లో ఘనంగా సత్కరించారు. ఇప్పటి వరకూ సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సరల్‌గా పని చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఏయూలో లెక్చరల్‌గా ప్రారంభమైన తన జీవితం అదే వర్సిటీ వీసీగా చేసే భాగ్యం కలిగిందన్నారు. ఇప్పుడు సీయూకు చాన్సలర్‌గా నియామకం కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ సంగీత కళాకారుల సంఘం ప్రతినిధులు కొణతాల రాజు, మహ్మద్‌ఖాన్, క్రియేటివ్ కామెడీ క్లబ్ ప్రతినిధి మేడా మస్తాన్‌రెడ్డి, మెలోడీ సత్యనారాయణ, కందర్ప రాధ, ఆధ్యాత్మికవేతలు ఎం.వి.రాజశేఖర్, ఫణిస్వామి, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధి చెన్నా తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమాల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు టోకెన్లు ఇస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు ఆదివారం ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు డ్రా తీశారు. రైతులకు స్టాళ్ల నంబర్ టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కేటాయించిన స్టాళ్లలో వారే వ్యాపారం చేయాలన్నారు. కార్యక్రమంలో బజార్ సహాయకుడు సతీష్, వ్యాపారులు పాల్గొన్నారు.

ఒడిశాలో ఉన్న వ్యక్తి కోసం గాలింపు

సీతమ్మధార: మహారాష్ట్ర నుంచి పిస్టోల్‌ను తీసుకొచ్చిన కేసులో ఒడిశాకు సంబంధించిన వ్యక్తి కోసం ఫోర్త్‌టౌన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మహారాష్ట్ర జాల్నా జిల్లాకు చెందిన దత్త పవర్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించారు. శ్రీధర్ హరికిషన్ పతింగికి పిస్టోల్ ఇచ్చి ఒడిశాలోని పూరిలో ఒక వ్యక్తికి దానిని ఇవ్వాలని చెప్పడంతో రూ.30 వేలకు బేరం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఒడిశాలోని బరంపురానికి 15 కిలో మీటర్ల దూరంలో ఆ వ్యక్తి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు శనివారం రాత్రి ఒక ఎస్ఐతోపాటు మరో కానిస్టేబుల్ అక్కడికి వెళ్లారు. సోమవారం అతడిని నగరానికి తీసుకొచ్చే అవకాశముంది.

మోసం చేశారంటూ బిల్డర్‌పై ఫిర్యాదు

బీచ్ రోడ్డు: ఫ్లాట్ కొనుగోలు విషయంలో బిల్డర్ తమను మోసం చేశారంటూ ఓ మహిళ మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెంగళరావుపేటకు చెందిన చెట్టి లక్ష్మీబాయ్ తన కుమారుడు జగన్ పాండురంగాపురంలోని జీకాన్ బిల్డర్స్‌కు చెందిన బే రిడ్జ్ ఆపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌ను 2018లో కొనుగోలు చేశారని, దీనికి బిల్డర్స్ సత్యనారాయణ, శివరామ్‌లు ఏడాదిలోగా అన్ని సదుపాయాలతో పూర్తి చేసి ఇస్తామని హామీ ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే అనుకున్న సమయానికి ఫ్లాట్ అప్పగించలేదు. అలాగే ఒప్పందం ప్రకారం అపార్ట్‌మెంట్ బిల్టప్ ఏరియా 2884 ఎస్ఎఫ్‌టీలో కార్పెట్ ఏరియా 1997 ఎస్ఎఫ్‌టీ ఇవ్వాల్సి ఉందని, కానీ బిల్డర్ 1785.72 ఎస్ఎఫ్‌టీ మాత్రమే ఇచ్చారని ఆమె ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే బిల్డర్‌కు చెందిన మేనేజర్ తమను బెదిరించారని, తాము నష్టపోయామని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బిల్డర్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. శ్రీకాకుళానికి చెందిన శ్రీ నటరాజ నాట్య మండలి వారిచే ప్రదర్శన వినాయకకౌత్వం నృత్యాంశంతో ప్రారంభమైంది. కళాకారులు జాస్మిత, స్నేహ, సింధు, మహిశ్రీ, హాసిని, వర్షిత నృత్యం చేయగా ఈ.బిందుమహేశ్వరి నృత్య దర్శకత్వం వహించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవలు, తగాదాల్లో తలదూర్చితే, మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రోజూ ఎక్కడికి వెళ్లిన సమాచారమివ్వాలని చెప్పారు. ఎటువంటి నేరాలు జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ హితవు పలికారు. అనంతరం వారిని ఇళ్ల వద్ద అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో.. స్థానిక ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్‌రావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు ట్రాఫిక్ ఆంక్షలు



ట్రాఫిక్ ఆంక్షల గురించి వివరిస్తున్న ఏసీపీ జాన్ మనోహర్

సీతమ్మధార: జూలై 2న సింహాచలం శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం గిరిప్రదక్షిణను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు కాలినడకన తరలిరానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలపై ఏసీపీ జాన్ మనోహర్ పలు సూచనలిచ్చారు. ఈమేరకు ఆదివారం ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. సింహాచలం నుంచి బయలుదేరి హనుమంతువాక, వెంకోజీపాలెం, ఎన్ఏడీల వద్ద జాతీయ రహదారిపై కొంత మంది భక్తులు నడిచే అవకాశం ఉన్నందున 2వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు విశాఖ సిటీలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులను వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాలను ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి విశాఖ వైపు వచ్చే భారీ వాహనాలు, ప్రైవేట్ వాహనాలను లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి మీదుగా మళ్లిస్తున్నట్లు చెప్పారు. విశాఖలో ఎక్కాల్సిన ప్రయాణికులు ఆనందపురం, పెందుర్తి, అనకాపల్లి వద్దకు చేరుకునేటట్లు బోర్డింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గిరిప్రదక్షిణ రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కె.ఎస్.వి.ఎస్.ప్రసాద్, ఎస్ఐ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయత్నంతో ఏదైనా సాధ్యం



విద్యార్థులకు సూచనలిస్తున్న రేవళ్ల మోహన్

సీతంపేట: ప్రయత్నంతో ఏదైనా సాధించవచ్చని ఆక్స్‌మో బ్రిడ్జి వ్యవస్థాపకుడు రేవళ్ల మోహన్ అన్నారు. రంగసాయి నాటక గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఇంగ్లిష్ మాట్లాడటంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధనతో జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చని, చిన్నపాటి మెళుకువలతో ఏకాగ్రత సుసాధ్యం అవుతుందన్నారు. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగుపడటం కోసం పలు సూచనలు, సలహాలిచ్చారు. సోషల్ వర్కర్ అబ్దుల్ కరీం మాట్లాడుతూ యాంత్రిక సమాజంలో జ్ఞాపకశక్తి ఆవశ్యకతను వివరించారు. లెక్సికోగ్రాఫర్, వీఎస్‌డీ ఆంగ్ల ఆంధ్ర నిఘంటువు కర్త సనపల జీవన్‌కుమార్ మాట్లాడుతూ భాషలో పట్టు వినియోగంలో అనుసరించాల్సిన విషయాలను వివరించారు. కార్యక్రమంలో మాచెర్ల ఆనంద్‌శర్మ, బి.ఎస్.చంద్రశేఖర్, బాదంగీర్ సాయి, డి.హేమ, రామకృష్ణ పాల్గొన్నారు.